

# సాయంకాలమైంది

## – గొల్లపూడి మారుతీరావు



"సాయంకాలమైంది" నవల మొదటి నుంచీ మంచి పుణ్యం చేసుకుంది. ఆంధ్రప్రభ లో సీరియల్‌గా వస్తున్నప్పటి నుంచీ వందల్లో అభిమానుల్ని, చాలామంది భక్తుల్నీ పోగుచేసుకుంది. ఈ పదేళ్ళలో ఓ వందమందైనా ఈ నవల గురించి ప్రస్తావించినప్పుడు విశ్వనాథ సత్యనారాయణగారి "వేయిపడగల" ప్రసక్తి, పోలిక తెస్తూ వచ్చారు. అందరికీ చెప్పే అవకాశంలేదు కనుక - యిక్కడ చేతులు కట్టుకు చెప్పే నిజం ఒకటుంది. నేను "వేయిపడగలు" అప్పటికీ, యిప్పటికీ చదవలేదు. అయితే అంతటి మహారచయిత రచనను నా నవల గుర్తు చేయగలిగినందుకే నాకు ఎంతో ఆనందం. కాస్తపాటి గర్వం.

శ్రీ వైష్ణవ సత్సంప్రదాయ వైభవాన్ని సవివరంగా నాకు తెలియచెప్పిన పూజ్యులు శ్రీశ్రీ భాష్యం అప్పలాచార్యుల వారికీ, శ్రీ సాతులూరి గోపాలకృష్ణమాచార్యుల వారికీ నా ధన్యవాదాలు. ఆంధ్రప్రభలో ఈ నవల రాయడానికి కారకులు మిత్రులు, అప్పటి వారపత్రిక సంపాదకులు వల్లూరి రాఘవరావుగారు. మొదటి అధ్యాయం స్వయంగా చదివి ఆయన చేతిలో పెట్టినప్పుడు పులకించి పాదాభివందనం చేసి అందుకున్నారు. వారి సంస్కారమది.

సరే! మాజీ ప్రధాని పి.వి.నరసింహారావుగారి దగ్గర్నుంచి ఎందరో సాహితీపరులు, పాఠకులు ఈ నవలకు అభిమానులయ్యారు. చాలా మంది భక్తులయ్యారు. చదివి భోరున కన్నీరు కార్చి నాతో గంటలకొద్దీ మాట్లాడిన మహిళలున్నారు. 200ఆలో ఈ నవల ప్రచురితమయింది. సరిగ్గా ఏడు సంవత్సరాల తర్వాత గుంటూరు నుంచి రవికృష్ణ అనే ఓ తెలుగు పండితులు నవల చదివి, ఆనందించి - సవివరంగా ఇందులో కనిపించిన లొసుగుల్ని ఎత్తిచూపుతూ ఎనిమిది పేజీల ఉత్తరం రాశారు. "నా అజ్ఞానం కొద్దీ నెరుసులు అనుకుంటున్నానేమో నేను పానకంలో పుడకలు అనుకుంటున్న వాటిని బాల్య చాపల్యం కొద్దీ మీ దృష్టికి తీసుకువస్తున్నాను" అని సవినయంగా రాశారు. ఈ ఒక్క ఉత్తరాన్నే యిలా ముందుమాటలో ఉటంకించదలిచాను.

వాటిలో అన్నీ లేదా చాలా అంశాలు సహేతుకంగా, సబబుగా వున్నాయి. రెండో ప్రచురణ సందర్భంలో ఆయనకి ఫోన్ చేసి, ఆ సవరణలను మరొక్కసారి తెలియజేయమన్నాను. తెలియజేశారు. వారికి కృతజ్ఞతలు. '

కొన్ని రచనలకు పుట్టిన వేళా విశేషముంటుందేమో. బెర్నార్డ్ షా తన రచనలన్నింటిలో "సెంట్ జోన్"ని ఎక్కడో ఎంపిక చేసి చూపిన గుర్తు. కాలచక్రం ఒరిపిడిలో ముందు తరాలకు నా రచనల్లో ఈ "సాయంకాలమైంది" నవల, "కళ్ళు" నాటిక, "రాగరాగిణి" నాటకం, "జుజుమురా" కథ, "కళ్యాణి" రేడియో నాటిక - యిలా నిలవగలిగితే అది నాకు దక్కిన అదృష్టమేననుకుంటాను.

- గొల్లపూడి మారుతీరావు

విప్లవం అంటే - గతంలో ఆయుధాలతో అడవుల్లో తిరిగేవారు చేసే పని - అని ఒక అభిప్రాయం ఉండేది నాకు. మీరు మీ మీ ఆయుధాలతో సమాజాన్ని కొత్తగానయినా చక్కటి బాటలో నడిపిస్తున్నారు. అందుకు గురువుగారైన మీకు - మీ అనుమతి లేకుండానే - మీ శిష్యుడిగా ప్రకటించుకుంటున్నాను.

జె. శ్రీనివాసరెడ్డి అనే మొద్దు శీను, ఖైదీ నంబరు 405, మహానది బ్లాక్, చర్లపల్లి

*(గత సంచిక తరువాయి)*

**విచిత్రంగా చాలా** రిలాక్స్ అయిపోయింది ఆండాళ్ళు. తల్లిదండ్రుల్ని బాధపెడుతున్నాననిపించలేదా? వ్యక్తిగతమైన సాన్నిహిత్యం లేని ఓ కులాంతర వివాహం ఈ బాధని మరిపించగలదనిపించిందా? ఆ దశంలో అనిపిస్తుంది. ఆ తెగింపూ, తిరుగుబాటూ రక్తం వేడిది. మఓ పాతికేళ్ళ తర్వాత వెనక్కి తిరిగి చూసుకున్నా, అప్పటికి ఏం చెయ్యడానికీ అవకాశం ఉండదు.

గాఢంగా నిద్రపట్టింది ఆండాళ్ళుకి. ఓ రాత్రికి చల్లటి చెయ్యి నుదురు నిమురుతుంటే చటుక్కున మెలుకువ వచ్చింది. తల్లి తన తలని ఒడిలో పెట్టుకుని నిమురుతూ మాట్లాడూతోంది తనకి తను చెప్పికుంటున్నట్టు.

"ఇది మంచా, చెడా అని నన్నెవరూ అడగరు. ఇదే మంచి అని మొదట్నుంచీ ఎవరో ఒకరు చెప్పడం, చెప్పిందాన్ని పాటించడం నాకు అలవాటయిపోయింది.

"నా పెళ్ళికి 30రోజుల ముందు నుంచీ తాతగారు మల్లెలు, బొగడలూ, సన్నజాజులూ, సంపెంగలూ బుట్టలకొద్దీ తెప్పించారు. ధనుర్మాసం రోజులు రోజంతా నా చేత మాలలు గుచ్చేవరు. అప్పటికి మీ నాన్నగారు నన్ను చూసి వెళ్ళారు. పెళ్ళికి అన్ని ఏర్పాట్లూ అయిపోయాయి. గోదాదేవి రంగనాథుని అర్చించినట్టు, నా చేత మడిసార కట్టించి, కొప్పునిండా పువ్వులు అలంకరింపచేసి, మెడలో మాలలు వేయించి, ప్రతిరోజూ ఓ పాశురం పారాయణ చేయించేవారు, 'స్వామి సంతుష్టుడయితే నిన్ను ఆశీర్వదిస్తాడమ్మా!' అని మార్గళి అంతా వ్రతాచరణతోనే గడిపించేవారు. ముప్పైరోజులో గడిచాక 'ఇవాళ స్వామి విష్ణుచిత్తుని కలలో దర్శన మిచ్చిన రోజు, నీ జన్మతరిస్తుందమ్మా' అని నా చేత మల్లెల స్నానం చేయించేవారు. ఆ మర్నాడే పెళ్ళి నీకా ముచ్చట జరిపించాలనుకున్నానమ్మా" అంది పరాకుగా గోడల్తో చెప్తూ. తనకి తెలివొచ్చినట్టు తల్లికి తెలియనివ్వలేదు. కానీ తను భర్తతో మరో వందేళ్ళు బతికినా, ఈ తల్లి కలను తీర్చని బాధని మాన్పలేదు.

"భగవంతుడా! ఎంత సరళమయిన కలల్తో తయారుచేశావు వీళ్ళిద్దరినీ? రేపట్నుంచీ కూతురులేని బాధ వీళ్ళని హింసించకుండా చూడు" అనుకుంది.

ఎక్కడనుంచి వచ్చిందీ కరుకుదనం? ఎక్కడి నుంచి వచ్చిందీ గుండె ధైర్యం? ఎవరిస్తారీ స్థైర్యాన్ని? సమాధానం - వయస్సు, వయస్సు!

గుడిసెకి అరఫర్లాంగు దూరం నుంచే సానయ్య కేకలు వినిపిస్తున్నాయి. ముత్తిరాగాలు తెలుస్తున్నాయి. ఇది తనకలవాటయిన ప్రపంచం. నాన్న పొద్దుటే తాగేశాడనుకున్నాడు కూర్మయ్య.

కానీ, గుడిసె దగ్గరవుతున్నకొద్దీ తండ్రి మాటలు తెలుస్తున్నాయి. అంతకుమించి అతని గొంతులో మత్తుకన్నా, ఆవేశం తెలుస్తోంది. తల్లి గొంతులో భయం తెలుస్తోంది.

ఏమయిందివాళ? మరో రెండు నిముషాల్లో అర్థమయింది. సానయ్య పాకముందు మట్టి అరుగుమీద ఆండాళ్ళు కూచుని ఉంది. ఆమె చేతిలో చిన్న ట్రావెలింగ్ బాగ్ ఉంది. కొయ్యబారిపోయాడు కూర్మయ్య. ఆండాళ్ళు ఏం చేసినా, చెయ్యకపోయినా ఇక్కడికి వస్తుందనుకోలేదు. ఆమె పెదాలమీద టెన్సింగ్ నార్కే ఎవరెస్టు ఎక్కినప్పుడు కలిగినంత చిరునవ్వు లాస్యం చేస్తోంది. ఆ పాక ముందు లక్ష్మీదేవి మరో లోకం నుంచి ప్రత్యక్షమయినట్టుంది. మళ్ళీ.. మళ్ళీ ఏ వెయ్యోసారో ఆమె ఏ పరిస్థితుల్లోనూ తన భార్య కావడానికి వీల్లేదనుకున్నాడు కూర్మయ్య.

మొదట కొడుకుని ముత్తి చూసింది. చూస్తూనే, ఆమె ఏడుపులో శ్రుతి పెరిగింది. "రా రా, నా కొడకా! ఎంత పనిచేసావురా ఆయమ్మ బతుకులో నిప్పులు పొయ్యడానికట్రా నిన్ను సదివించింది?"

జుత్తు పట్టుకుని పెళ్ళాన్ని ఒక్క తోపు తోశాడు సానయ్య. తుపుక్కున ఉమ్మి, మట్టిని కుమ్మే రోకలిని పట్టుకుని లేచాడు.

"అమ్మ నంజికొడక... లచ్చిందేవిలాంటి ఆ తల్లి మీద నీకు తప్పుడు ఆలోసనలెలా వచ్చాయిరా? ఆ యమ్మని ముట్టుకుంటే మనం బుగ్గయిపోతాంరా తప్పుడు నా కొడకా! నిన్నియాళ గొయ్యి తీసి కప్పెట్టేసి.."

ముందుకొస్తున్న సానయ్యని ఆండాళ్ళు చెయ్యిపట్టుకుని ఆపింది. ఆ స్పర్శకి తాచుపాము మీద కాలేసినట్టు గతుక్కుమన్నాడు సానయ్య. ఒక్కసారి ఆండాళ్ళు కాళ్ళమీద పడిపోయి ఏడ్చేశాడు. "వద్దమ్మా! నా కులం నా మడుసులు గంగపాలయిపోవాలని శాపమెట్టకు తల్లీ ఈ అపచారానికి నువ్వే సిచ్చ ఏసినా నేను తలొంచుకు బరిత్తాను"

ఆండాళ్ళు చటుక్కున కాళ్ళు వెనక్కి తీసుకుంది. అప్పటికి పదిమంది ఊరివాళ్ళు పోగయ్యారు. అందులో అందరికీ సుభద్రాచార్యులవారినీ తెలుసు, ఆండాళ్ళునీ తెలుసు.

"బుద్ధిలేదురా నీకు? నీ అంతరమేంటి? ఆ పిల్ల కుటుంబమేంటి? నాలుగక్షరాలు చదువుకొన్నావు కదా అని ఆ పిల్లని లేపుకొస్తావా?" అన్నాడొకాయన.

"అలా పెట్టండి బాబూ ఆ ఎదవ నాకొడుక్కి అంతా కలిసి గడ్డెట్టండి"

వంట చెరకు అమ్ముకునే అక్కాయి బుగ్గలు నొక్కుకుంటూ ఆండాళ్ళుతో "నీకు మాత్రం బుద్దెలా లేకపోయిందమ్మా? ఆచార్లుగారు పిలిత్తే కొండమీద దేవుడు దిగొచ్చేవాడు. ఆరి పట్టివి.. ఈ పాడుబుద్దులేంటి?"

కూర్మయ్యకి నవ్వొచ్చింది. ఇంత గొడవ జరుగుతున్నా ఏమాత్రం నిలకడ తప్పనిది కూర్మయ్య ఒక్కడే కారణం అతని అంతరాంతరాళాల్లో ఎటువంటి మలినమయిన ఆలోచనా లేదు. కాగ, స్పష్టమయిన లక్ష్యశుద్ధి ఉంది. అతనికి నవ్వొచ్చిన విషయమేమిటంటే అక్కడ ఆండాళ్ళుని ఏ పరిస్థితుల్లోనూ చేసుకోబోవడంలేదని చెప్పడానికి తను ఆమె తల్లిదండ్రులకి చెప్పవచ్చాడు. ఇక్కడ ఆండాళ్ళు తననే చేసుకుంటానని నిర్ణయం తీసుకుని కట్టుబట్టలతో వచ్చేసింది.

మీద మీదకి వస్తున్న తండ్రిని ఆపి "నువ్వాగు, నాన్నా! నేనా అమ్మాయిని పెళ్ళి చేసుకోబోవడంలేదు" అన్నాడు.

పద్మనాభం యావత్తూ ఒక్కసారి ఆ మాటతో చల్లబడిపోయింది. అంతా అవాక్కయిపోయారు.

సానయ్యకి ఎక్కడాలేని ధైర్యం వచ్చింది. కొడుకు మెడమీద సెయ్యేసి "సెప్పరా ఆ మాట నాక్కాదురా ఆ తల్లి పాదాల మీద తలెట్టి సెప్పు" అని తోశాడు.

మరో ఆలోచన లేకుండా ఆండాళ్ళు పాదాల దగ్గర పడ్డాడు కూర్మయ్య. తండ్రి తోసినందుకు కాదు. ఆండాళ్ళు మనస్సులో ఏర్పరచుకున్న కఠోర నిర్ణయాన్ని ముక్కలు ముక్కలు చెయ్యడానికి, పదిమంది సమక్షంలో ఇది పెద్ద ఆయుధమనిపించి కాళ్ళమీద పడ్డాడు.

ఆండాళ్ళు వీపు మీద కొన్ని తరాల, యుగాల సత్సంప్రదాయం బరువు గంజి కావిడి మోస్తోంది. ఆమె పాదాల దగ్గర అన్ని తరాల, యుగాల వ్యత్యాసం యథాప్రకారంగా మోకాళ్ళు తెగిపడి ఉంది.

నిర్దుష్టంగా గిరులు గీసుకుని, సడలడానికి ఏమాత్రం ఆలోచనలో కూడా రానివ్వని రెండు వర్గాల పొలిమేరలో నుంచున్న ఇరవై రెండేళ్ళ పిల్ల ఏం చెయ్యాలి? ఇది అనూచానంగా వస్తున్న చాతుర్వర్ణ్య వ్యవస్థకి సాయంకాలమా? అన్వయించుకుని, కొత్త అర్థాల్ని ఆశయించే కొత్తపుంతకి ప్రాతఃకాలమా?

అంత పెద్ద ఆలోచనలు ఆమె మనస్సులో లేవు. అన్ని తరాల వైదిక ధర్మాన్ని ఓ చిన్న మనస్సులో అనిందపూర్వమయిన లక్ష్యశుద్ధిగా సమీకరిస్తే ఏమవుతుంది?

ఆ క్షణంలో ఆ సంఘటన అవుతుంది. కాళ్ళ దగ్గర ఉన్న కూర్మయ్యని లేవనెత్తి, చిత్తశుద్ధితో, సంకల్పశుద్ధితో, త్రికరణశుద్ధితో ఒక్కసారి చుట్టూ ఉన్న ప్రపంచాన్ని లేకుండా చేసుకుని, అతని పెదాల మీద బలంగా ముద్దు పెట్టుకుంది.

"మీ అందరి ప్రశ్నలకీ, ఆక్షేపణలకీ, సంశయాలకీ" కూర్మయ్యవైపు తిరిగి "ఇన్‌క్లూడింగ్ యూ.. ఇదే ఇదే నా సమాధానం" అని ట్రావెలింగ్ బాగ్ తీసుకుని విశాఖపట్నంవైపు నడవడం ప్రారంభించింది.

ఆ క్షణంలో పద్మనాభం పద్మనాభమంతా ఇన్‌క్లూడింగ్ కూర్మయ్య కొయ్యబారిపోయింది.

**28**

రెండు ఫర్లాంగులు నడిచిందో లేదో వెనకనుంచి సైకిలు తొక్కుకుంటూ దూసుకువచ్చాడు కూర్మయ్య. సైకిలు దిగి ఆ దారిన వెళ్తున్న రైతుకి ఊళ్ళో ఇవ్వమంటూ సైకిలు అందజేశాడు. ఆండాళ్ళు చేతిలో బాగ్ అందుకున్నాడు. మొదటిసారిగా బాధ్యతగా ఆమె చుట్టూ చెయ్యి వేశాడు.

వర్షంలో గొడుగులాగా కాక, ఆ చెయ్యి ఆమె జీవితం చుట్టూ పరిచిన హామీలాగా, రక్షణలాగా భావించింది ఆండాళ్ళు. ధైర్యంగా, నమ్మకంగా అతని భుజం మీద తల ఆనించి నడిచింది ఎక్కడికి? ఆ ప్రశ్న ఆమె అడగనూలేదు. కూర్మయ్య చెప్పనూలేదు.

ఇద్దరూ వెంకటాచెలం ఇంటికి వచ్చి తలుపు తట్టారు. రాత్రి డ్యూటీ ముగించుకుని అప్పుడే ఇల్లు చేరింది జయవాణి. గుమ్మంలో నిలబడిన ఇద్దరినీ చూసి నిర్ఘాంతపోయింది. కూర్మయ్యని ఆమె చూసింది. కానీ ఈ ఇద్దరూ ఇలా కలిసిరావడం..

"నాకేమయినా కష్టమొస్తే ఈ ఇంటికి వెళ్ళమని అన్న చెప్పాడు మేడమ్. ఇప్పుడు అంకుల్ లేరు" ఆండాళ్ళు వాక్యం పూర్తికానివ్వలేదు.

జయవాణి ఎక్కువ ఆలోచించలేదు. "కానీ నేనున్నాను రండి" అని ఆండాళ్ళు చెయ్యిపట్టుకుని లోపలికి నడిచింది. కూర్మయ్య ఏదో చెప్పబోయాడు. "మాట్లాడుకోవడానికి చాలా టైముంది. మొదట స్నానం చెయ్యండి. వంట చేస్తాను. మరో గంటలో విక్టోరియా వస్తుంది" అని వంటగదిలోకి మాయమయింది.

పూనా జైలులో కస్తూరిబా కన్నుమూసినప్పుడు మహాత్ముని కన్నువెంట ఒకే ఒక్క అశ్రుకణం రాలింది. తన సత్యవ్రతంతో ఏమాత్రం పొంతన లేని జీవిత సహధర్మచారిణి తన నుండి శలవు తీసుకున్నప్పుడు మనస్సు విచలితమవడానికి కేవలం అది సంకేతం. మనస్సు ఉగ్గబట్టే మహోన్నతమయిన ఉద్యమం వైపు ఆయన దృష్టి లగ్నమయింది. వ్యక్తిగతమయిన దుఃఖానికి ఆ మనస్సులో ఆ మాత్రం చోటే ఉన్నది. అది యోగ్యం. కర్తవ్యమూ, లక్ష్యశుద్ధీ, ధర్మనిరతీ, నిగ్గుతేరిన ఆబ్జెక్టివిటీ కలిసి ఇచ్చిన స్థితప్రజ్ఞత్వమది.

ఆండాళ్ళు దూరమయినప్పుడు భార్యాభర్తలిరువురూ ఒక్కసారయినా చర్చించుకోలేదు. ఒక్కసారీ భోరుమనలేదు. అనూహ్యమైన కర్మసంస్కారమేదో వాళ్ళ దుఃఖాన్ని ఆమాత్రం దూరంగా ఉంచగలిగింది. అది స్వధర్మనిష్ఠాగరిమకు అపురూపమయిన తార్కాణం. అంత మాత్రాన ఆ మనస్సులో మనస్తాపం లేదని కాదు. ఆచార్యులవారి వేదనకి ఆటవిడుపు అంత సులువుగా బయటపడలేదు కానీ, మనస్సు విప్పకుండా గుండెల్లోనే రగిలిన అగ్నిపర్వతం అచిరకాలంలోనే మరో రూపంలో వరదమ్మ జీవితంలో బయటపడింది.

కూర్మయ్య, ఆండాళ్ళ విషయం తెలియగానే హుటాహుటిన పరుగెత్తుకువచ్చాడు రాఘవాచారి భార్యతో సహా. ఇలా తప్పుతోవ పట్టించిన ఆ ఫుండాకోర్‌ని వెంటనే పోలీసు కంప్లయింట్ ఇచ్చి అరెస్టు చేయిస్తానన్నాడు. వాడికి భూమి మీద నూకలు పుట్టకుండా చేస్తానన్నాడు. నిజమయిన బాధతో, ఆవేశంతో చిందులు తొక్కాడు రాఘవాచారి.

సుభద్రాచార్యులవారు ప్రశాంతంగా నవ్వారు.

"అతన్ని నేను అల్లుడిగా అంగీకరించలేకపోవచ్చు. కానీ ఆండాళ్ళు భర్తగా స్వీకరించిది. కాదనే అర్హత నాకు లేదు. ఆ విషయం మరిచిపొండి" అన్నారు.

నిర్ఘాంతపోయాడు రాఘవాచారి.

"ఏమమ్మా? మీ మాటా అదేనా? కడుపు చించుకుని కన్న ఇరవై రెండేళ్ళ బిడ్డ పొరపాటు చేస్తే దిద్దుకోరా?" అన్నాడు.

వరదమ్మ నవ్వింది. "ఆయనకన్నా నాకెక్కువ తెలియదు. అది ఆయనకీ కూతురే" అంది.

ఆ క్షణంలో వరదమ్మ పదడుగుల ఎత్తున కనిపించింది రాఘవాచారికి. ఏం చెయ్యాలో తోచలేదు. కానీ ఇక్కడ అన్యాయం జరిగిపోతోంది. ఏదో చెయ్యాలి. ఆ రాత్రే అమెరికా ఫోన్ చేశాడు.

అంతా విని సుభద్రాచార్యులవారికంటే నిలకడగా సమాధానం చెప్పాడు తిరుమల. "ఇప్పుడే నాతో కూర్మయ్య మాట్లాడాడు. ఎల్లుండి వాళ్ళ పెళ్ళి రిజిస్ట్రేషన్. వీలయితే మా తరపున మీ ఇద్దరూ వెళ్ళి రెండు బొకేలు ఇచ్చిరండి" అన్నాడు.

రాఘవాచారికి మతిపోయింది. పరమనిష్ఠాగరిష్ఠులు, తరతరాలుగా శ్రీపాద సన్నిధిలో స్వామిని అర్చించి తరిస్తున్న కుటుంబంలో ఒకమ్మాయి కులాంతర వివాహం చేసుకుంటోంది. అన్న అమెరికా నుంచి ఆశీర్వాదాలు తెలియజేస్తున్నాడు. శ్రీవైష్ణవత్వాన్ని లాంఛనప్రాయంగా మాత్రమే నిలుపుకున్న రాఘవాచారికి ఆ సంయమనానికి కారణం అర్థంకాలేదు.

ఏమయినా ధైర్యం చేసి అల్లుడి కోరికను తీర్చలేకపోయాడు. ఆండాళ్ళు పెళ్ళికి హాజరుకాలేకపోయాడు.

అలాంటి పెళ్ళికి సాధారణంగా లభించే ఆదరణ కన్నా ఎక్కువే లభించింది. ఆండాళ్ళు కూర్మయ్యలకు. రెండువైపుల తల్లిదండ్రులూ రాలేదు. జయవాణి, విక్టోరియా, సంజీవి, కైకవశి, నవనీతం ఆండాళ్ళు తరపున, చక్రవర్తి మిత్రులంతా కూర్మయ్య తరపున వచ్చారు.

రిజిస్ట్రారుకి ఇలాంటి పెళ్ళిళ్ళు కొత్తకాకపోయినా, ఇలాంటి పెళ్ళిళ్ళకి ఈ హడావుడి కొత్త. తరువాత కనకమహాలక్ష్మి ఆలయానికి తీసుకువెళ్ళి అమ్మవారి సమక్షంలో కూర్మయ్యచేత ఆండాళ్ళుకి తాళికట్టించారు. మెడికల్ స్టూడెంట్స్ కలిసి తాళిబొట్టు కొన్నారు. నవనీతం ఉంగరం కొన్నది.

ముహూర్తం సమయానికి విచిత్రంగా ఇద్దరి మనస్సుల్లోనూ తిరుమలే కదిలాడు. ఈ వివాహాన్ని సమర్థించడానికి అందరికీ అన్ని రకాల కారణాలున్నా మొదట్నుంచీ ఇద్దర్నీ సమర్థించిన వ్యక్తి తిరుమల.

"ఒక్కసారి మీ అమ్మగారికీ, నాన్నగారికీ కనిపించివద్దామా?" అన్నాడు కూర్మయ్య ఆండాళ్ళు చెవిలో. ఎక్కువ ఆలోచించలేదు ఆండాళ్ళు. వద్దంది. అలాంటి ప్రశ్న తన తల్లిదండ్రుల విషయంలో కూర్మయ్య వెయ్యనూలేదు. వేస్తాడని ఆండాళ్ళు ఎదురుచూడనూ లేదు.

ఆ రోజుల్లో విశాఖపట్నంలో చాలా ప్రసిద్ధమయిన హోటల్ 'అప్సరా' డబుల్ బెడ్‌రూమ్ తాళం చెవులిచ్చాడు సంజీవి శుభాకాంక్షలు పలుకుతూ. హోటల్ గదికి వస్తూనే తిరుమలకి ఫోన్ చేశారు. ఫోన్‌లోనే హడావుడి చేశాడు తిరుమల. పాడ్ కూడా మనఃస్ఫూర్తిగా శుభాకాంక్షలు పలికింది.

చివరిగా ఆండాళ్ళు అంది "నువ్వో కారణానికి, నేనో కారణానికి అమ్మా నాన్నకీ దూరమయిపోయామన్నయా! ఎప్పుడయినా నువ్వు వాళ్ళ దగ్గరకి రాగలవు. నేను వెళ్ళలేను. ఇదివరకటి కన్నా ఎక్కువగా కనిపెట్టుకుని ఉండు" అంది. ఆ క్షణంలో కళ్ళు చెమ్మగిల్లాయి.

"ఫర్వలేదమ్మా త్వరలోనే ఇద్దరూ సర్దుకుంటారు. అన్నీ మంచిగానే జరుగుతాయి" ఆ మాట అంటున్నప్పుడూ అతనికి తన మాటల్లోనే నమ్మకం కనిపించలేదు. ఆ విషయాన్ని గుర్తుపట్టి నవ్వుకుంది ఆండాళ్ళు.

కూర్మయ్య స్కాలర్ షిప్ పైకం ఇప్పుడు బాగా వినియోగానికి వచ్చింది. రెండు నెలల్లో కూర్మయ్యకి కాకినాడ బదిలీకి అనుమతి లభించింది. ఆండాళ్ళు కాలేజీ చదువు ఇకనుంచీ ప్రైవేటుగా సాగాలని ఇద్దరూ నిర్ణయించుకున్నారు. హితులూ, స్నేహితులూ అందరూ వీడ్కోలు ఇవ్వగా దంపతులిద్దరూ బస్సులో విశాఖపట్నం నుంచి శెలవు తీసుకున్నారు.

పుట్టిన ప్రతివాడికీ ఈ సృష్టితో రుణం ఉండిపోతుందట. భూమి మీద పడుతూండగానే, మనం అడిగినా అడగకపోయినా సృష్టి తల్లి ప్రాణవాయువుని అందిస్తుంది. అది అందడం కొన్ని సెకన్లు ఆలస్యమయితే, మనిషి ఏమవుతాడో డాక్టర్లు చెప్తారు. ఈ సృష్టిలో ఆక్సిజన్ అందడం అరక్షణం ఆలస్యమయితే గుండె రిపేరులో పడిందని అర్థం. అరనిముషం ఆలస్యమయితే ఆ గుండె గురించి మరిచిపోవడం మంచిది. ఇది ప్రకృతికి మనిషి తీర్చుకోలేని రుణం. అలాగే మనల్ని ఈ లోకంలో పడెయ్యడానికి తను తిని, ఓ జీవపదార్థాన్ని పదినెలలు పెంచిన తల్లి రుణం. పుట్టాక పేగు తెంచితే కానీ మనం మనం కాము. అప్పుడూ తల్లి శరీరంలో భాగమే. మూడోది ఋషి ఉణం. అనాదిగా మన జీవితం సుఖవంతంగా సాగడానికి ఈ వ్యవస్థను తీర్చి, కొన్ని పరిధుల్ని నిర్ణయించిన తెలివైన పెద్దదిక్కు రుణం అన్నమాట.

అయితే ఇవన్నీ ఆలోచించనంత తెలివయినవాడయిపోయాడు మానవుడు. అందుకే పెద్దలు విశ్వాసాన్ని, స్వామి భక్తినీ ఓ కోతిద్వారా మనకి నేర్పాలని తాపత్రయపడ్డారు రామాయణంలో. ఇది పరమధార్మికమయిన కర్మభూమిలో పరీక్షకు పెట్టగా నిలిచిన ఎమ్‌పెరికల్ రూల్స్.

డీజిల్ బస్‌లో కాకినాడవైపు పోతున్న ఓ ఆడపిల్ల మనస్సులో ఇలాంటి ఆలోచనలు వచ్చే అవకాశంలేదు. పక్కనున్న వ్యక్తి కొండంత అండగా, ఆ వ్యక్తిలో కోరుకున్న సాహచర్యం గుండెల్ని నింపే అభ్యుదయంగా కానవస్తున్నది. ఫరవాలేదు. స్వార్థంతో తమ ఆనందాన్ని వెతుక్కునే చాలామందిని భరించే ఔదార్యం ఇంకా ఈ సంప్రదాయానికి ఉన్నది. ప్రియురాలి కోరిక తీర్చడానికి తల్లి గుండె కోసి తీసుకువెళ్తూ రాయి తన్నుకుని పడిపోయి లేచి వెళ్తున్న కొడుకుని, "దెబ్బ తగల్లేదు కదా, నాన్నా? జాగ్రత్తగా వెళ్ళు బాబూ" అని ఆ గుండె ఆశీర్వదించే నీతికథ ఈ దేశానిది. ఇది కథే కానీ ఇందులో అనుభూతి, అతి బలమయిన మాతృప్రేమ ప్రతిపాదనా అవాస్తవం కాదు. కనీసం ఈ జాతికి ఇంకా.

ఈసారి పోలా పైడి తల్లినాయుడి వసారాలోంచి తనతో ఫోన్లో మాట్లాడటానికి వచ్చిన సుభద్రాచార్యుల వారిని ఎంత ప్రయత్నించినా చెల్లెలి గురించి అడగలేకపోయాడు తిరుమల. అలాంటి అపశ్రుతిని తట్టుకోవడానికి ఆయన దగ్గర కొండంత అండ - సనాతన ధర్మ రక్ష ఉన్నదని తెలుసు. అతని మనస్సులో ఒక్కరితోనే మాట్లాడాలని పీకుతుంది. తల్లితో.

ఆరోజు పదినిముషాలు రెట్టించి రెట్టించి మరీ తల్లి క్షేమ సమాచారం అడిగాడు. చెప్పవలసినంత చెప్పారు సుభద్రాచార్యులవారు. చిత్రం. తిరుమల ఆండాళ్ళు ప్రసక్తి తీసుకురాలేదు. ఆచార్యులవారు ఆ విషయం చెప్పాలని ప్రయత్నమూ చెయ్యలేదు. అది ఇద్దరి మనస్సుల్లోనూ రగులుకుంటూ చల్లారని కార్చిచ్చు.

వరదమ్మ ఎప్పుడూ ఎవరితోనూ ఫోన్‌లో మాట్లాడలేదు. ఫోన్ పట్టుకోవడం కానీ, మాట్లాడటంకానీ ఆమెకి తెలీదు. ఫోన్ పట్టుకున్నందుకే పట్టుచీర వదిలి జీన్స్‌పాంటు తొడిగినంత సిగ్గుపడిపోయింది. మొదట రానంది. ఆండాళ్ళు వెళ్ళినప్పటినుంచీ తన ప్రపంచంలోనే ఉంటోంది. అది వదిలి రావడం ఆమెకు ఇష్టంలేదు. కొడుకు మాట్లాడాలంటున్నాడని ఆచార్యులవారు చెబితే "వాడే ఇక్కడికి రారాదా?" అంది. రావడానికి చాలా శ్రమ అవుతుందని, ఖర్చవుతుందని, టైమవుతుందని ఆమె భాషలో చెప్పారు. చివరికి ఎలాగయితేనేం ఒప్పించారు.

వరదమ్మ తమ ఇంటికి రావడాన్ని పండగ చేసేశాడు పైడితల్లినాయుడు. ఆమెకు పట్టుచీర పెట్టి, దూరం నుంచే నేలమీదే సాష్టాంగపడిపోయింది నాయుడి పెళ్ళాం. అంతా అయ్యాక "తిరుమల ఏడీ?" అంది వరదమ్మ. ఎప్పుడూ సీరియస్‌గా ఉండే సుభద్రాచార్యుల వారే పగలబడి నవ్వేశారు. "తిరుమల ఇక్కడ లేడు. ఫోన్ చేస్తాడు" అన్నారు.

అదే అడగాలని ఆవిడ ఉద్దేశం. ఎలా అడగాలో తెలీక ఆమాటంది.

మరో అరగంటకి ఫోన్ మోగింది. తిరుమల గొంతు పక్కన కూర్చుని మాట్లాడుతున్నట్టే ఉంది. ఫోన్ ఇంకా ఆచార్లుగారు చేతిలో పెడుతూండగానే ఆమె కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. తీరా ఫోన్ పట్టుకున్నాక నిశ్శబ్దంగా ఉండిపోయింది. "మాట్లాడు" అన్నారు ఆచార్యులుగారు.

"అబ్బాయి ఏడీ?" అంది.

"అటుపక్క నీ మాట వింటున్నాడు" అన్నాడు.

"చిన్నా!" అంది వరదమ్మ.

ఆ పిలుపు సప్తసముద్రాలు దాటి, ఆకాశాన్ని చీల్చుకుని, భూమికి ఆవలిపక్క ఉన్న తిరుమల గుండెల్లోకి క్షిపణిలాగా దూసుకుపోయింది.

"అమ్మా!" అన్నాడు చిన్నా. ఆ ఇద్దరి పలకరింతకీ టెలిఫోన్ సౌకర్యాన్ని కనుగొన్న గ్రాహంబెల్ జీవితం ధన్యమయింది. పరామర్శకీ, ఆత్మీయపు స్పర్శకూ అది ఆఖరిమాట.

ఎంతసేపూ ఏడుస్తుంది కానీ మాట్లాడదేం? ఇటు చూస్తున్న అంతా అవాక్కయి నిలబడి పోయారు. సుభద్రాచార్యులవారూ ఆనందంగా గమనిస్తున్నారు. కొన్నివేల మైళ్ళ టెలిఫోన్ సౌకర్యం కొన్ని క్షణాలు గడ్డకట్టుకుపోయింది. మూగబోయింది.

"అమ్మా నువ్వక్కడ ఉన్నావా?" అన్నాడు తిరుమల. సమాధానం చెప్పలేకపోయింది. ధారాపాతంగా తిరుమల మాటలు ప్రవహించాయి.

"అమ్మా! చెల్లాయిమీద కోపం తెచ్చుకోకు. దానికి మీ అందరిమీదా కోపం లేదు. తను కోరుకున్నవాడిని పెళ్ళి చేసుకుంది. నువ్వు బాధపడతావేమోనని నీతో మాట్లాడాలన్నాను. చెల్లాయి దూరమయినందుకు బాధగా ఉందా అమ్మా?" ఆగాడు.

సన్నటి, బంగారంలాంటి గొంతు ఇండియానుంచి అమెరికాకు ప్రయాణం చేస్తోంది.

"ఆళ్వార్‌గళ్ వాళి అరుళిచ్చెయల్ వాళి.."

ఇటు అంతా ఆశ్చర్యపోతున్నారు.

"అమ్మా! నా మాట వినిపిస్తోందా?"

"తాళ్వాదుమిల్ కురువర్ తామ్ వాళి.."

తిరుమల ఏదో అడుగుతున్నాడు. వరదమ్మ నోటివెంట ఉలగముంద పెరువాయ్ ఉపాయవరణం నిరాఘాటంగా ప్రవహిస్తోంది. కాస్సేపటికి ప్రపత్తి ముగిసింది. చేతిలో టెలిఫోన్ అలా పట్టుకునే స్పృహ తప్పి పడిపోయింది వరదమ్మ.

29

గుమ్మంలో తిరుమలని చూసి నిశ్చేష్టులయిపోయారు సుభద్రాచార్యులు, వరదమ్మా. ఫోన్‌లో మాట్లాడాక 36 గంటలు తిరగకుండా భూగోళానికి ఆవలివేపు నుంచి ఇంటిముందు వాలాడు తిరుమల. తల్లి మాట విన్నాక అతనికి భయమేసింది. ఏదో చెప్పని అన్యాయం ఆమెకి జరిగిపోతోందని మనస్సు చెప్పక చెప్పింది. ఎవరితోనూ సంప్రదించలేదు. ఎవరి సలహా తీసుకోలేదు. దొరికిన మొదటి విమానంలో టిక్కెట్టు కొనుక్కుని హుటాహుటిన ఇండియాకు వచ్చి వాలాడు.

ఇంట్లో అడుగు పెట్టగానే ఇల్లంతా గగ్గోలుగా, వాతావరణం అతి హృదయవిదారకంగా ఉంటుందని భావించాడు తిరుమల. కానీ అప్పుడే స్నానాన్ని ముగించుకుని, నుదుటిన స్వరూపాన్ని' అలంకరించుకుని, తిరువారాధనకి ఉపక్రమిస్తున్నారు ఆచార్యులవారు.

పెరుమాళ్ళ కైంకర్యాన్ని మడిసారకట్టుతో పవిత్రంగా సిద్ధపరుస్తోంది వరదమ్మ. అపరకర్మిష్టులకు ఉపశమనం కార్యదీక్షలోనే లభిస్తుంది. శరణాగతికోసం జీవితాన్ని శ్రీపాద సాన్నిధ్యానికి అంకితం చేసుకున్న వారికి స్థితప్రజ్ఞత్వం వెన్నతో పెట్టిన విద్య. ఆచార్యులవారికి అష్టాక్షరీ మంత్రం గొడుగు. వరదమ్మకి అయ్యవారి కొలువు శ్రీరామ రక్ష. వారిద్దరినీ చూసి నిరుత్తరుడయ్యాడు. ఇద్దరినీ ఎంతగానో ఓదార్చాల్సిన అగత్యం ఉన్నదనుకుంటూ ఇరవై ఎనిమిది గంటలకు పైగా ఉపశమన వాక్యాల్ని కూడబలుక్కుంటూ వచ్చిన తిరుమలకి ఆ ఇంట్లో ఎదురైన ప్రశాంతత అచ్చెరువు కొలిపింది. పాశ్చాత్య నాగరికతలో తలమునకలయిన చాలామందిని ఉద్విగ్నుల్ని చేసే చాలా సమస్యలకి ఏనాడో ఈ సంస్కృతి సమాధానాల్ని తయారు చేసి పెట్టింది. ఆచార్య దంపతుల మనస్సుల్లో పీట వేసుకున్న నిర్వికల్ప వాతావరణం ఒక యోగం. అది ఈ జాతి తాత్వికచింతన కొన్ని యుగాలుగా సిద్ధంచేసి ప్రసాదించిన సిద్ధాన్నం.

"అమ్మా!" అన్నాడు గుమ్మంలోంచే. వరదమ్మ మనస్సులో కిడుకుని చూడగానే ఉవ్వెత్తున ఆనందతరంగం లేచింది. ఆచార్యులవారి కళ్ళల్లో అంతే ఉధృతమైన తరంగం. "వరండాలో కూర్చో చిన్నా! తీర్థగోష్ఠి ముగిశాక" తల్లి అన్నది. తల్లిదండ్రులకి సేవచేస్తున్న పుండరీకుడి ప్రాంగణంలోకి పరమాత్మ వచ్చి నిలిస్తే అక్కడే వేచి ఉండమన్న భక్తుడి ఆనతిలాంటిదది. ఆగిపోయాడు. ఈ నిర్దిష్టమయిన కార్యదీక్ష ఎన్ని యుగాల వారసత్వమో? వారిని ఓదార్చడానికి వచ్చి తనేం చేస్తున్నాడిక్కడ. నవ్వొచ్చింది. కూర్చున్నాడు. తండ్రి గొంతులో పురుషసూక్తం వాతావరణంలో సుగంధ పరిమళంలాగా సుడులు తిరుగుతోంది. ఎప్పుడో పాతికేళ్ళక్రిందట - ఇంకా ముందు గోస్తనీ నదిలో రెండుగొంతులు ప్రాతఃకాలంలో ఈ పరిమళాన్ని ప్రకృతికి పంచేవి. ఇప్పుడొక గొంతు థర్మో డైనమిక్స్, షోడింగర్స్ థియరీ ఆఫ్ వేవ్ ఈక్వేషన్‌లో మునిగిపోయింది. ఏ కాలుష్యమూ లేని పవిత్రమైన కంఠం అతిసరళంగా భగవంతుడిని ధ్యానిస్తోంది. తిరుమలకి కళ్ళనీళ్ళు తిరిగాయి.

"చిన్నా!" అన్న పిలుపుతో తుళ్ళిపడ్డాడు.

"నువ్వు వస్తావని తెలుసు, కాఫీ తాగు" అని అతని ముందు నేలమీద పెట్టింది వరదమ్మ.

"ఎలా తెలుసు?" అని ఆశ్చర్యపోయాడు.

"నీ కోసం వారానికి మూడుసార్లయినా కాఫీ కలుపుతుంది. నీ ముందు కూర్చుని కనీసం నాలుగుసార్లయినా వండి వడ్డిస్తుంది." అన్నారు ఆచార్యులగారు భార్యను లోపలికి వెళ్ళనిచ్చి.

సందేహంలేదు. మాతృత్వపు మాధుర్యంతో మేళవించి, అలనాడు నాయనమ్మ కలిపి ఇచ్చిన కాఫీ తలంపుకు వచ్చింది తిరుమలకి. నాన్నగారి మాటలకి ఆశ్చర్యపోయాడు.

"నా కోసమా! నేను.. అమెరికాలో..."

నవ్వారు ఆచార్లుగారు. బృందావనంలో ఉన్న నందకిశోరుడికి జీవితమంతా వండి కైంకర్యాన్ని సిద్ధం చేసే తల్లికి అమెరికాలో ఉన్న కొడుకు కోసం వండి వడ్డించడం కష్టంకాదు.

భయంవేసింది తిరుమలకి. ఆచార్లుగారు వెదుక్కున్నంత చిన్న వివరణ సరిపోదు ఈ దినచర్యకు.

"నాన్నా! అమ్మని ఓసారి డాక్టర్‌కి చూపించారా?"

"ఎందుకు?"

"ఇది సైకిక్ ప్రాబ్లమ్"

నవ్వారు ఆచార్యులుగారు.

"అయితే ఇన్నితరాల భారతీయుల్ని పట్టిపీడించే రోగమిదే. అలనాటి శబరినుంచి ఈనాటి మీ అమ్మదాకా అద్వైతాన్ని ఆపోశన పట్టిన అదృష్టవంతులు. వాళ్ళనలా బతకనీ. పోతే, వాళ్ళనలాగే చావనీ. ఆమె వడ్డన నీకోసం కాదు. ఆమె మనస్సులో మాతృత్వానికి ఆచరణ రూపమది. ధన్యురాలు. దేవుడు, కొడుకు సేవలో తాదాత్మ్యాన్ని సాధించుకున్నది."

ఈ ఇంట్లో ఇద్దరు పిచ్చివాళ్ళున్నారని మనస్సులోనే రూఢిచేసుకున్నాడు. వెంకటాచెలం చనిపోయినందుకు మొదటిసారిగా మరింత బాధపడ్డాడు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

ఈ నవల గురించి కిరణ్‌ప్రభ టాక్ షో వినడానికి ఇక్కడ క్లిక్ చేయండి.